# మునుగోడులో 91.67 శాతం పోలింగ్

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- గత సాధారణ ఎన్నికలకతో పోల్చితే స్వల్పంగా పెరిగిన ఓటింగ్

చండూరు, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి పొద్దుపోయేవరకు కూడా కొనసాగింది. ఉదయం 10 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగినా తరువాత ఊపందుకుంది. 12 నుంచి 3 గంటల వరకు సుమారు లక్షకు పైగా ఓట్లు పోలయ్యాయి. 5 గంగల వరకు క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దాంతో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో మొత్తం 2,52,648 మంది ఓటర్లు ఉండగా 2,31,595 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,16,515 మంది, స్త్రీలు 1,15,079 మంది ఉన్నారు. గత సాధారణ ఎన్నికల్లో 91.30 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి స్వల్పంగా పెరిగింది.

## ప్రశాంతంగా ఓటింగ్..

నియోజవర్గంలో మొత్తం 307 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మహిళా పోలింగ్ స్టేషన్లు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ర్యాంపులు, వీల్‌చైర్లు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. నడవలేని వారిని ఇంటి వద్దనుంచి తీసుకువచ్చి ఓటు వేసేలా సౌకర్యం కల్పించారు.

## భారీ బందోబస్తు

ఎన్నికలలో అవాంఛనీయ ఘటనులు జరుగకుండా పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 112 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. నిరంతరం ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అభ్యర్థులు

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



సంస్థాన్ నారాయణపురం : సర్వేల్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు

## మునుగోడులో 91.46 శాతం

మునుగోడు : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్ర 5 గంటల్లోపు క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. మండల వ్యాప్తంగా మొత్తం 36,816 మంది ఓటర్లు ఉండగా 33,671 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు16,715, పురుషులు16,957 మంది ఉన్నారు. మొత్తం మీద 91.46 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటి రాజగోపాల్‌రెడ్డి వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక వసతులు కల్పించారు.

## చౌటుప్పల్‌లో 92.8 శాతం

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 92.8శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 62,869 ఓటర్లకు గాను 58,453 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 31,362 మంది పురుషులకు గానూ 29,296 మంది, 31,506 మంది మహిళా ఓటర్లకు గానూ 29,157 మంది ఓటు వేశారు. ఒకరు ఇతర ఓటరు ఉండగా వారు ఓటు హక్కు వినియోగించుకోలేదు.

## భద్రతను పర్యవేక్షించిన అడిషనల్ సీపీ

పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ సీపీ డీఎస్. చౌహన్ పర్యవేక్షణలో 200 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. స్థానిక ఏసీపీ మొగులయ్యతోపాటు నలుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, కేంద్రబలగాలు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి, ఎస్.లింగోటం, నేలపట్ల, పంతంగి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అడిషనల్ సీపీ తరుణ్‌జోషి సందర్శించారు.



చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్న యువతులు



చౌటుప్పల్ :తంగడపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ సీపీ



మర్రిగూడ : ఓటు హక్కు వినియోగించుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు పానుగోటి మాధవరావుతో పోలింగ్ సిబ్బంది



ఓటుహక్కు వినియోగించుకున్న చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళావెంకన్న



గట్టుప్పల్ : మండల కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, సర్పంచ్ ఇడెం రోజా



నాంపల్లిలో వృద్ధులను పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది



చండూరు మండలం అంగడిపేట ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



గట్టుప్పల్ :తెరట్‌పల్లి గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూ లైన్‌లో నిలబడ్డ ఓటర్లు



మునుగోడు : వృద్ధురాలిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది



ఓటుహక్కు వినియోగించుకున్న బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు శ్రీనువాస్‌గౌడ్



నాంపల్లి లో ఓటు వేయడానికి బారులు దీరిన మహిళలు





నాంపల్లి : మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



మునుగోడు మండలంలోని గూడపూర్‌లో ఓటు వేసిన యువకులు, మహిళలు



రామన్నపేటలో ఓటు హక్కు వినియోగించకునేందుకు బారులు దీరిన జనం



మునుగోడులో ఆదర్శ పోలింగ్ స్టేషన్

## ఘర్షణకు పాల్పడిన వారిపై కేసు నమోదు

గరిడేపల్లి : ఎన్నికల సందర్భంగా మండలంలోని వెలిదండ గ్రామ పోలింగ్ బూత్ వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగి ఒకరికొకరు రాళ్లు రువ్వుకోగా ఇరు వర్గాలపై గురువారం గరిడేపల్లి పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. గరిడేపల్లి ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెలిదండ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ సమీపంలో కొందరు వ్యక్తులు పార్టీ కక్షలను మనస్సులో పెట్టుకుని మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో రెండు గుంపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుని దాడి చేసుకున్నారన్నారు. అలాగే ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయగా వెంటనే అక్కడున్న పోలీస్‌లు వారిని చెదరగొట్టి ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన వ్యక్తులపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**ఓటు వేస్తూ వీడియో తసిన వ్యక్తిపై :** ఎన్నికల సందర్భంగా ఓటు వేస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. అట్టి వ్యక్తిని త్వరలో గుర్తించి అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. అయితే ఆ వ్యక్తి మండలంలోని పానుగోడు గ్రామానికి చెందినవాడిగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.